వేంకటేశ్వరస్వామి ఆలయ స్థలాన్ని కాపాడండి


గదులు నిర్మిస్తున్న కబ్జాదారులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట ప్రాంతంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ భూములను కబ్జాచేస్తున్నా రెవెన్యూ, ఆలయ ఈఓ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కల్లా రిపున్నారెడ్డి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కుల సంఘాల పేరుతో సర్వే నంబర్ 348/1లో రెండు ఎకరాలు కబ్జాచేసి గదులు నిర్మిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడి, ఆలయాన్ని పరిరక్షించాలని పున్నారెడ్డి కోరారు.

కబ్జాల బారినుంచి చెరువులను..

గచ్చిబౌలి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చెరువులు, కుంటలు పూర్తిగా అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని రక్షించాలని జనం కోసం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డిని కలిసి చెరువుల కబ్జాలను అడ్డుకోవాలని వినతిపత్రం అందజేశారు.

ఎల్లమ్మ చెరువులో వ్యర్థాల తొలగింపు


చెరువులో గుర్రపుడెక్క, వ్యర్థాలను తొలగిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, ఎంటమాలజీ సిబ్బంది

హైదర్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంటమాలజీ సిబ్బందితో కలిసి చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపుడెక్క తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రగతినగర్ పరిసర ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైనేజీ నీరుతో ఎల్లమ్మచెరువులో కలిసి కలుషితం అవుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, శివరాజ్‌గౌడ్, రాజిరెడ్డి, పాండు, వాసుదేవరావు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో ఫార్మాలో నెంబర్ 1గా భారత్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌కేర్, ఫార్మా రంగాల్లో ఆవిష్కరణలకు, పరిశోధనలకు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ పెట్టింది పేరని, ఆస్ట్రేలియా ఫార్మా ఎగుమతుల్లో 70 శాతం ఇక్కడి నుంచే ఉంటాయని క్వీన్ లాండ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సౌత్ ఏషియా కమిషనర్ అభినవ్ భాటియా తెలిపారు. బయో ఏషియా సదస్సులో భాగంగా నోవాటెల్ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సదస్సులో నిపుణులతో కలిసి మాట్లాడారు. హెల్త్‌కేర్ రంగంలో ఆస్ట్రేలియా ఆవిష్కరణలు, భారత్‌లోని నిపుణులైన మానవనరులు ఒకతాటిపై చేర్చేందుకు తాము ముందుకు వచ్చామన్నారు. రానున్న దశాబ్దాల్లో ఫార్మా రంగంలో ప్రపంచంలోనే మొదటి స్థానానికి భారత్ చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయో ఇంజనీరింగ్ అండ్ నానోటెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ అలెన్ రోవన్ మాట్లాడుతూ కేరళలో బర్డ్‌ఫ్లూ వ్యాపించిన సమయంలో తమ వర్సిటీ పరిశోధనల ద్వారా రూపొందించిన వ్యాక్సిన్‌ను అందించి సహకరించామని గుర్తుచేశారు. భారత్‌లో ఫార్మా రంగ విస్తరణకు అనుకూల వాతావరణం ఉందని, దీనికి క్వీన్‌లాండ్ తమ టెక్నాలజీని అందించేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ క్వీన్‌లాండ్ డీన్ ప్రొఫెసర్ ప్రసాద్ యార్లగడ్డ మాట్లాడుతూ టెక్నాలజీ మార్పిడి కోసం ఇండియాలోని యూనివర్సిటీలు, ఫార్మా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. ఇతర దేశాలతో పోల్చితే తక్కువ ఖర్చుతో, ప్రపంచం విశ్వసించే డాటాను అందిస్తామని క్లినియల్స్ ఫౌండర్ సీఈఓ మారి బేరి తెలిపారు. సదస్సులో సదరన్ ఆర్ఎన్ఏ బిజినెస్ హెడ్ క్రిస్‌వాజ్, ఏషియా సంస్థ సీఈఓ డాక్టర్ రంజీత్ ఎస్ అజ్మానీ, క్విఐఎంఆర్ బెర్‌హోగర్ డైరెక్టర్ హెడ్ తమన్నా మోనెమ్ మాట్లాడారు.

సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు కట్టుదిట్టమైన భద్రత

- రాచకొండ సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మార్చి 1 నుంచి మూడు రోజులపాటు జరగనున్న సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు. ఫిబ్రవరి 17న ప్రారంభమైన పదో ఎడిషన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్-2024 పోటీలో భాగంగా మార్చి 1 నుంచి 3 వరకు టి-20 మ్యాచ్‌లు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీపీ మాట్లాడుతూ ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వివిధ భాషల సినీతారలు పాల్గొనే క్రికెట్ మ్యాచ్‌లకు భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. టికెట్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని, సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కూల్‌డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాల ధరలు నిబంధనల మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, భద్రతను పర్యవేక్షించాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్ల విషయంలో గందరగోళం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, డీసీపీ(ఎస్‌బీ)కరుణాకర్, డీసీపీ(క్రైమ్స్) అరవింద్‌బాబు, ఎస్‌టీ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ పురుషోత్తంరెడ్డి, కుషాయిగూడ ఏసీపీ నరేష్‌రెడ్డి, ఏసీపీ నరేందర్ గౌడ్, సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌ఫౌండర్ విష్ణువర్ధన్ ఇందూరి, అధికారులు పాల్గొన్నారు.

వాహనాల మధ్య కనీస దూరం పాటించండి

- వీడియో విడుదల చేసిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్లపై వాహనాల మధ్య కనీస దూరం పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఈ ప్రమాదాలపై తాజాగా అవగాహన కల్పిస్తూ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వీడియో విడుదల చేశారు. 'బస్సు ఇతర వాహనాల వెనుక 50 మీటర్ల దూరం పాటించాలి. ఏదైనా కారణాలతో మీ ముందు డ్రైవర్ సడన్ బ్రేక్ వేస్తే ఆ వాహనాన్ని ఢీకొట్టకుండా ఈ దూరం మిమ్మల్ని కాపాడుతుంది. వర్షం, పొగ మంచు సమయంలో వాహనాల మధ్య దూరం ఇంకా ఎక్కువగా ఉండాలి' అని వీడియోలో ట్రాఫిక్ పోలీసులు వివరించారు.

పేదరిక నిర్మూలనకు బీజేపీ ప్రభుత్వం కృషి

- బీజేపీ నాయకుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లిలోని ఓ హోటల్లో మంగళవారం నిర్వహించిన బ్రాహ్మణ సమావేశంలో ఆయనను వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఫలాలు అందరికీ అందితే పేదరికానికి ఆస్కారం ఉండదన్నారు. ఆ ప్రక్రియ వేగం పుంజుకుందన్నారు. దేశం పురోగమన దిశలో పయనిస్తుందన్నారు. శంకర్ శర్మ, రాజేశ్వర్ శర్మ మాట్లాడుతూ ధర్మ సంరక్షణ చేయాలన్నారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి టికెట్ సాధించి, మంచి మెజారిటీతో గెలవాలని ఆకాంక్షించారు.

నిజాంపేట్ బడ్జెట్ రూ.111.50కోట్లు


బడ్జెట్ సమావేశంలో మేయర్ కొలన్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు

నిజాంపేట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన రూ. 111.50 కోట్ల బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మేయర్ కొలన్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు అధ్యక్షత మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను 2023-24 సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

ఈసందర్భంగా మేయర్ నీలారెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘం ఆదాయం నుంచి వేతనాలు, పౌరసేవల ఉద్యోగుల జీతాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులు, రుణవాయిదాల చెల్లింపులు 10శాతం నిధులను పురపాలక సంఘం సొంత ఆదాయ నిధులు, పట్టణ ప్రగతి నిధులు, 15వ యునైటెడ్ నిధులు, హరితహారం, గ్రీన్ బడ్జెట్ పనులకు రూ. 10 కోట్ల 71లక్షల 25వేలు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో 1/3 వంతు కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో క్లిష్టమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధికి కేటాయించడం జరుగుతుందన్నారు. మైనార్టీలు, మురికి వాడల ప్రాంతాలకు రూ. 13 కోట్ల 29లక్షల 58 వేలు కేటాయించడం జరిగింది. జీతం ఖర్చులు 14శాతం, పారిశుధ్యం ఖర్చులు 9శాతం. సీసీ చార్జీలు 2శాతం, రుణం తిరిగి చెల్లింపులు 4 శాతం, గ్రీన్ బడ్జెట్ 10 శాతం, ఇతర నిర్వహణ కోసం 22శాతం, బ్యాలెన్స్ 13 శాతం, ప్రజా సౌకర్యాలు 5 శాతం, వార్డుల వారీగా పనుల కోసం 21 శాతం, మున్సిపల్, జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు చేయనున్న పలు అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించారు. కార్పొరేషన్‌లోని 33 డివిజన్‌ల పరిధిలో చేపట్ట బోయే, చేపడుతున్న నిర్మాణ అభివృద్ధి పనులకు నిధులు, కావాల్సిన మౌలిక సదుపాయాలు, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలి. ఇలా అన్ని రంగాల్లో కార్పొరేషన్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుదామని సభ్యులకు మేయర్ పిలుపు నిచ్చారు. ప్రధానంగా కార్పొరేషన్‌లో బస్తీలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి, వీధి కుక్కల బెడద, ట్రాఫిక్ ఇబ్బందులు, దోమల ఫాగింగ్ వంటి పలు కీలక అంశాలపై కార్పొరేటర్ల సలహాల, సూచనలతో చర్చా సమావేశం ముగిసింది. సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, వాటర్ వర్క్స్, రెవెన్యూ, అర్బికల్చర్, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

దుండిగల్ బడ్జెట్ రూ. 54.45కోట్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): దుండిగల్ పురపాలక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరానికి చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అధ్యక్షతన ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దుండిగల్ మున్సిపాలిటీకి సంబంధించి ఆదాయం రూ. 54కోట్ల 45లక్షల 18 వేలు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధి కోసం కౌన్సిల్ సభ్యులు ఎవరి వార్డులో వారు ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించే విధంగా పని చేయాలని సూచించారు. బడ్జెట్ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే మౌలిక సదుపాయాలపై కౌన్సిలర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, కమిషనర్ కె. సత్యనారాయణ రావు, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, కౌన్సిలర్లు సుంకరి కృష్ణ, అనంతస్వామి, రామ్ గౌడ్, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్, మహిళా కౌన్సిలర్లు, మేనేజర్ నర్సింగులు, రెవెన్యూ అధికారి సునంద, పీహెచ్‌సీ డాక్టర్ నిర్మల, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణకుమార్, అకౌంటెంట్స్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ దరఖాస్తుల్లోనూ కంప్యూటర్ సైన్స్‌దే హవా

- జేఎన్‌టీయూ పీహెచ్‌డీ అడ్మిషన్లకు ముగిసిన గడువు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ ఇలా కోర్సు ఏదైనా.. అడ్మిషన్లలో కంప్యూటర్ సైన్స్‌దే హవా కొనసాగుతోంది. పీహెచ్‌డీ ప్రవేశాలకై జనవరి 23న జేఎన్‌టీయూ నోటిఫికేషన్ విడుదల చేయగా, ఈనెల 24న దరఖాస్తుకు గడువు ముగిసింది. వివిధ ఇంజనీరింగ్ కోర్సుల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం మొత్తం 880 దరఖాస్తులు అందగా, ఒక్క కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ కోసమని 430మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం. మిగిలిన బ్రాంచ్‌లన్నీ కలిపి ఒక ఎత్తయితే.. కంప్యూటర్ సైన్స్‌ది మరొక ఎత్తు అని సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. లేట్‌ఫీతో దరఖాస్తుకు మరో వారం రోజులు గడువు ఉండడంతో.. ఈ ఏడాది పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల సంఖ్య వెయ్యికి పైగా రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

సీట్లు 220.. దరఖాస్తులు 880

యూనివర్సిటీ పరిధిలోని పరిశోధన కేంద్రాల్లో ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలకు సంబంధించి మొత్తం 220 సీట్లు ఉన్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాజా నోటిఫికేషన్ ప్రకారం నాలుగేళ్ల బీటెక్‌తో పాటు ఎంటెక్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఈ దఫా నోటిఫికేషన్‌లో మూడేళ్ల డిగ్రీ, మరో మూడు లేదా రెండేళ్ల పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు ఎంటెక్ పూర్తిచేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించారు. మొత్తం 220 పీహెచ్‌డీ సీట్లలో అత్యధికంగా కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి 62 సీట్లుండగా, మెకానికల్ 36, ఎలక్ట్రికల్ 25, సివిల్ 24, ఈసీఈ 18, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, కెమిస్ట్రీ 10, ఎన్విరాన్‌మెంట్ 4, మ్యాథమేటిక్స్ 8, నానోటెక్నాలజీ 3, ఫిజిక్స్, వాటర్ రిసోర్సెస్ 4, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ 6 సీట్లు ఉన్నాయి.

మహిమ గల దేవుడు మల్లికార్జునస్వామి


ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే వివేకానంద్

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మెట్టుకానిగూడ, రాజీవ్‌గాంధీనగర్‌లో మంగళవారం జరిగిన మల్లన్న జాతరకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మహిమగల దేవుడు మల్లన్న స్వామిని కొలవడం వల్ల బాధలు తొలగిపోయి సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు విజయరామ్‌రెడ్డి, జగద్గిరిగుట్ట వెంకటేశ్వర దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ వేణుయాదవ్, పాక్స్ డైరెక్టర్ పరిశ శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ నాయకులు, సూరారం డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి'

గాజులరామారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన కార్పొరేటర్ రావుల శేషగిరితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్, గంగయ్య, శ్యామ్ సుందర్, ప్రసాద్, సాయిలు, రాములు చిన్న, వీరన్న, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యంపై అవగాహన

నిజాంపేట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని వికాస్ ది కాన్సెప్ట్ పాఠశాలలో మంగళవారం ఆరోగ్య పరిరక్షణ అనే కార్యక్రమాన్ని క్యాడ్ కేర్ యూకే అండ్ గెట్, సెట్, ఆరోగ్య ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ ఎస్. సౌజన్యలక్ష్మి, డైరెక్టర్ రాహుల్, సీఓఓ సంజీవ్, ప్రధానోపాధ్యాయులు దుర్గాకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని ది కాన్సెప్ట్ పాఠశాలలో ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. దీని ద్వారా విద్యతో పాటు ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని విద్యార్థులకు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి పోలి, ప్రసూతి వైద్యుడు, గైనకాలజిస్టు ఎంఎన్‌జే ఆస్పత్రి డాక్టర్ సబినేకపాసి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డబ్ల్యూహెచ్ఓ డాక్టర్ చిరంజీవి దీక్షిత్, డాక్టర్ ఉషారాణి పోలి, డాక్టర్ సబినేకపాసి పాల్గొన్నారు.

సందడిగా ఫ్రెషర్స్ డే

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చింతల్‌లోని ఓ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డేను మంగళవారం వైఎంఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. క్యాట్‌వాక్, ఫ్యాషన్ షోతో పాటు సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మేనకా పాటిల్, డైరెక్టర్లు సీహెచ్. గోవిందరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్‌బాబు, రామకృష్ణ, జైశంకర్‌గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బఫర్‌జోన్ భూములను మాయం చేశారు


బోయిన్ చెరువు వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చెరువు సుందరీకరణ పేరుతో ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధిలోని బోయిన్ చెరువు బఫర్‌జోన్ భూములను మాయం చేసి బీఆర్ఎస్ నాయకులు కోట్లాది రూపాయలు దండుకున్నారని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ ఆరోపించారు. మంగళవారం ఆయన నియోజకవర్గ, ఓల్డుబోయిన్‌పల్లి డివిజన్ నాయకులతో కలిసి చెరువును, బఫర్ జోన్(ఎఫ్‌టీఎల్)లో ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయిన్ చెరువు వాస్తవికత ఎంతుందో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సర్వే చేసి వాస్తవాలు అందజేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొండ కింది పుష్పారెడ్డి డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్ఎస్ నేతలు

బాలానగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌కు చెందిన 10 మంది బీఆర్ఎస్ నాయకులు, ముస్లిం మహిళలు కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం బాలానగర్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలువగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వేణు, ఎండీ జమీర్, అబ్దుల్లా, వాహీద్, నజీర్, అస్లాం పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు సత్కారం



కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఈఈఈ ప్రొఫెసర్ నర్రి యాదయ్య ఈనెల 29న ఉద్యోగ విరమణ పొంది మంగళవారం రియల్ టైమ్ సిమ్యులేషన్స్ ఆఫ్ ఎలక్ట్రికల్ సిస్టమ్స్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా యాదయ్య సేవలను వీసీ కట్టా నరసింహరెడ్డి, రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జీవీ నరసింహరెడ్డి కొనియాడారు. శాలువతో సత్కరించి పూల బొకే అందజేసి యాదయ్యకు వీడ్కోలు పలికారు.

- జేఎన్‌టీయూ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి)



- ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన టీఎస్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూర్ వెంకటనర్సింగ్‌రావును కూకట్‌పల్లి యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫతేనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి క్రాంతి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చిటకోరు కృష్ణ, సీనియర్ నాయకుడు వి.నర్సింగ్‌రావు, నాగేశ్ ఎండీ రవూఫ్ బల్మూరిని ఆయన నివాసంలో కలిసి శాలువతో సత్కరించారు.

- ఫతేనగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి)

చేవెళ్ల సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో నిర్వహించిన ఆరు గ్యారెంటీల్లో 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500గ్యాస్ పథకల ప్రారంభోత్సవ సీఎం రేవంత్‌రెడ్డి సభకు మంగళవారం సీనియర్ నాయకుడు కూన సత్యంగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో మారుతికుమార్, కావూరి ప్రసాద్, వెంకటేష్, ముజ్జుబాయ్, షేక్ ఫయామ్, మహేష్‌ముదిరాజ్, షేక్ అప్రోచ్, షేక్చాంద్, జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.


వీవీనగర్ డివిజన్ నుంచి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


కూకట్‌పల్లి: ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలను మంగళవారం ప్రారంభించిన సందర్భంగా చేవెళ్లలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వివేకానందనగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరితోపాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు.

మియాపూర్: చేవెళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మంగళవారం రలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జలమండలి డీజీఎంకు సన్మానం


జలమండలి డీజీఎంను సన్మానిస్తున్న గాంధీనగర్ గృహ సముదాయం వాసులు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ జేఎన్ఎన్‌యూఆర్ఎం నివాసాలకు తాగునీరు అందిస్తున్న జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లను గాంధీనగర్ గృహ సముదాయం వాసులు మంగళవారం సత్కరించారు. కాలనీ బ్లాక్‌నెంబర్ 113, 124 నివాస సముదాయానికి గతంలో నాలుగు రోజులకోసారి నీరు సరఫరా అవుతుండగా కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు రోజు విడిచి రోజు నీరు అందిస్తున్నారు. బస్తీకి తాగునీటి సమస్యను తీర్చినందుకు గాను కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అంజలయ్య, రామాంజనేయులు, ఆదినారాయణ, శ్రీలత, కుమారి తదితరులు పాల్గొన్నారు.



విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమను తాము విద్యార్థులు మార్చుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వెంకటేశం అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాలలో అకడమిక్ లీడర్‌షిప్ ఎక్స్‌లెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్కి ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్కి డైరెక్టర్ రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

- రాయదుర్గం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి)

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

చందానగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ. 2.50లక్షలు విలువ చేసే 3.84 కేజీల ఎండు గంజాయి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. రంగారెడ్డిజిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌సీయూ బస్టాప్ వద్ద తనిఖీలు చేస్తుండగా బహదూర్‌పూరకు చెందిన అవినాష్‌దత్త గంజాయిని బైక్‌పై తరలిస్తుండగా పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

బాలానగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 28నుంచి మార్చి 20 వరకు కొనసాగనున్న ఇంటర్ పరీక్షలకు ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 28నుంచి మార్చి 18 వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు ఈనెల 29 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అధికారు తెలిపారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చైతన్య జూనియర్ కాలేజీ, గీతాంజలి జూనియర్ కాలేజీ(ఏపీహెచ్‌బీకాలనీ), రెయిన్‌బో స్కూల్ పద్మానగర్ ఫేస్-1, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేంబ్రిడ్జి కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా మంగళవారం కూకట్‌పల్లిలోని బస్టాప్ వద్ద కాంగ్రెస్ నాయకుడు గూడెపు నాగరాజు ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జిట్టా సునీల్ యాదవ్, రాచమళ్ల శేఖర్‌గౌడ్, కావలి పాండు, సీహెచ్.రాజు, అనిల్, ఉదయ్, సాయికుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన కార్పొరేటర్

ఫతేనగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ శోభనా కాలనీ మార్కెట్ సమీపంలో ఉన్న అరబ్‌షా బాబా దర్గాను కార్పొరేటర్ సతీష్‌గౌడ్ మంగళవారం సందర్శించారు. రూ. 30 లక్షలతో చేపట్టిన దర్గా ప్రహరీ నిర్మాణం పూర్తయిన తర్వాత తొలిసారిగా దర్గాకు వచ్చిన కార్పొరేటర్‌ను మైనారిటీ నాయకులు శాలువతో సత్కరించారు.

పార్కు పరిశీలన

హైదర్‌నగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ అడ్డగుట్టలో పార్కు పరిసరాలను జీహెచ్‌ఎంసీ, హార్టికల్చర్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. అడ్డగుట్ట కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు పార్కును పరిశీలించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, హార్టికల్చర్ దాసు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి గోపన్‌పల్లి గ్రామంలో ఎల్లమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సీసీ రోడ్డు ప్రారంభం

చందానగర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి రాజీవ్‌గృహకల్పలో సీసీ రోడ్డును మంగళవారం కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని సీసీరోడ్లు వేశామన్నారు.

ఖరీదైన వాహనాలే టార్గెట్

- ఆంధ్రా నుంచి వచ్చి తెలంగాణలో చోరీలు..
- అరెస్ట్ చేసిన పోలీసులు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి నగరంలో ఖరీదైన వాహనాలను దొంగిలిస్తున్న ముఠాను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన జి.రామాంజనేయులు(21), గోగుల గోపాలకృష్ణ(20), షేక్ కసినపల్లి బాషా(24)లు ఒక ముఠాగా ఏర్పడి తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో ఖరీదైన బైక్‌లను దొంగిలించేవారు. గత ఏడాది అక్టోబర్‌లో హైదరాబాద్ గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైక్‌ను, నవంబర్‌లో అఫ్జల్‌గంజ్ పీఎస్ పరిధిలో మరో బైక్‌ను దొంగిలించి గుంటూరుకు తరలించారు. ఈనెలలో సూర్యాపేట టూ టౌన్ పీఎస్ పరిధిలో రెండు బైక్‌లను, హైదరాబాద్ సుల్తాన్‌బజార్ పరిధిలో ఒక బైక్‌ను దొంగిలించి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్(ఎంజీబీఎస్) పార్కింగ్‌లో పార్క్ చేశారు. మూడు రోజుల క్రితం గుంటూరు నుంచి మిగతా రెండు బైక్‌లను విక్రయించేందుకు నగరానికి తీసుకుచ్చి ఎంజీబీఎస్‌లో పార్క్ చేశారు. వీటిని అమ్మేందుకు రెండు బుల్లెట్ బైక్‌లపై ముగ్గురు నిందితులు మంగళవారం కాచిగూడ ఎక్స్‌రోడ్ మీదుగా కింగ్ కోఠికి వెళ్తుండగా అక్కడే తనిఖీలు చేస్తున్న సుల్తాన్‌బజార్ పోలీసులు వారిని ఆపారు. వారి కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని రెండు బుల్లెట్ బైక్‌ల నెంబర్లను పరిశీలించి దొంగిలించిన వాహనాలుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రా నుంచి బస్సులో వచ్చి దొంగిలించిన వాహనాలను కింగ్ కోఠిలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు తేలింది. దీంతో ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.


పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు

బుల్లెట్ వాహనాన్ని దొంగిలించి...

ఖరీదైన బుల్లెట్ వాహనాలే టార్గెట్‌గా వారు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. లాక్ చేసి ఉన్న బుల్లెట్ వాహనాన్ని దొంగిలించి నేరుగా ఎంజీబీఎస్‌లోని పార్కింగ్ ప్రాంతంలో పెట్టి ఒక్కొక్కటిగా అమ్మాలనేది నిందితుల ఉద్దేశమని అధికారులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తుతో పాటు అతని బృందాన్ని డీసీపీ రావుల గిరిధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ కె ముత్తు ఉన్నారు.

మల్కాజిగిరి నుంచి అవకాశం కల్పించండి


మాట్లాడుతున్న చంద్రశేఖర్ రెడ్డి

పంజాగుట్ట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం, ఖైతలాపూర్ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు డాకారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. 40సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. మల్కాజిగిరి ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేశానని, టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిచి అధిష్ఠానానికి బహుమతిగా ఇస్తానన్నారు.